క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

మాచర్ల: జిల్లా స్థాయిలో కృషి విజ్ఞాన్ కేంద్రాన్ని స్థాపించుటకు చర్యలు తీసుకోవాలని ఏపి ఆగ్రో సంస్థ పల్నాడులో ఏర్పాటు చేయాలని, జిల్లాలో కార్పొరేషన్ ఇన్సూరెన్సు బేస్ డే కాకుండా ఇవ్వాలని కోరుతూ జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిని కోరారు. వెలగపూడిలో జరిగిన వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌ల సమావేశంలో చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తక్కువ సబ్సిడీతో ట్రాక్టర్, థైవాన్ స్ప్రేయర్లు, టార్పిలిన్, యంత్రాలను ఇప్పించాలని పల్నాడులోని వివిధ వ్యవసాయ సంక్షేమ పథకాలు అందించాలని కోరారు.

పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



దాచేపల్లి : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని ప్రధానోపాధ్యాయుడు లింగిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ సమావేశాలు మంగళవారం జరిగాయి. తంగెడ మెయిన్ స్కూల్‌లో జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం అన్ని విధాలుగా అభివృద్ధి చేసిందని, విద్యార్థులు చదువుకునేందుకు అన్ని వసతులు కల్పించిందన్నారు. పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపించకుండా ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని, పాఠశాలలకు తల్లిదండ్రులు వచ్చి విద్యాబోధనపై చర్చించవచ్చునని ఆయన చెప్పారు. సమావేశాల్లో ప్రధానోపాధ్యాయులు ఎస్. రవికుమార్, చెట్టిపాగు ఏసురత్నం, శాస్త్రీ, వట్టెపు నాగేశ్వరరావు, సీఆర్పీలు అబ్రహాం, చంద్రమోహన్, వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి



దాచేపల్లి : విద్యార్థులు పట్టుదలతో చదవాలని ప్రధానోపాధ్యాయుడు టి. శాంతారావు అన్నారు. మండలంలోని మాదినపాడు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న చింతకింది కోటేశ్వరరావును మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ పాఠశాలలో 5వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులు ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్ష కోసం కోటేశ్వరరావు వేసవిలో శిక్షణ ఇచ్చాడు. 18 మంది విద్యార్థులకు పరీక్ష రాయగా 17 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోటేశ్వరరావును శాలువా, పూలదండలతో సన్మానించి అభినందించారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా చదువుకుని మంచి ఫలితాలు సాధిస్తే ఉన్నతమైన స్థానాల్లో ఉంటారని ప్రధానోపాధ్యాయుడు శాంతారావు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేయటం గర్వంగా ఉందని, ప్రభుత్వం ఇస్తున్న సహకారంతో విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించి ఫలితాలు సాధిస్తున్నామని ఉపాధ్యాయుడు కోటేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

అమ్మ ఒడి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

వెల్దుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల పట్ల ప్రేమతో ప్రతి విద్యార్థికి అందజేస్తున్న అమ్మ ఒడి పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల హెచ్‌ఎం పద్మ అన్నారు. మంగళవారం మండలంలోని శిరిగిరిపాడులోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి సీఎం జగన్ అన్ని రకాల వసతులను కల్పిస్తున్నారన్నారు. ప్రతి విద్యార్థికి కావాల్సిన పాఠ్య, నోటు పుస్తకాలతో పాటు యూనిఫాం, బూట్లు, టై, బెల్టు, మూడు జతల బట్టలుతో పాటు అన్నీ రకాల వసతులను కల్పిస్తున్నారన్నారు. బుధవారం సీఎం జగన్ విద్యార్థుల తల్లి ఖాతాలో రూ. 15వేల నగదును జమ చేస్తారన్నారు. ఈ పథకాన్ని తల్లులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

దుర్గి: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె సమతావాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 11గం''లకు ఎంపీపీ ఏచూరి సునీత సాయి శంకర్ అధ్యక్షతన సమావేశం ప్రారంభం కానుందని వివరించారు. మండల పరిధిలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసి పలువురు ఇతర ప్రజా ప్రతినిధులు వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

జానపాడు అభివృద్ధి కల సాకారం చేస్తాం

- రైల్వే బ్రిడ్జి పూర్తి అయితే జానపాడుకు డిమాండ్
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



జానపాడు గ్రామంలో పథకాల లబ్ధిని మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: జానపాడు గ్రామ ప్రజలు కన్న కలలను తాను సహకారం చేస్తున్నానని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని జానపాడు గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కార్యక్రమానికి హాజరు కావడంతో గ్రామ ప్రజలు, వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ముస్లిం సోదరులు భారీ సంఖ్యలో హాజరై ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ముందుగా మసీదులోకి వెళ్లి నమాజ్ ఆచరించారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన పథకాల లబ్ధిని వివరిస్తూ స్థానిక సమస్యలను తెలుసుకుంటూ సమస్యల పరిష్కార దిశగా అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరింపజేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి మాట్లాడుతూ జానపాడు పిడుగురాళ్ల పట్టణానికి సమీపంలో ఉంది అంతేకాకుండా జానపాడు గ్రామం గురజాల నియోజకవర్గంలోని పెద్ద గ్రామం, గ్రామంలో పది వేల ఓటర్లతోపాటు సుమారు 14 వేల మంది జనాభా నివసించే గ్రామం ఇంత పెద్ద గ్రామాన్ని అభివృద్ధి చేసే అవకాశం తనకు లభించిందన్నారు. రాష్ట్రానికి కేవలం ఐదు, ఆరు ఆర్ఓబీలే మంజూరు అయితే అందులో మన పిడుగురాళ్ల జానపాడు రైల్వే బ్రిడ్జి ఒకటి అని తెలిపారు. రూ. 52 కోట్లు పూర్తిస్థాయిలో నిధులు కేంద్రప్రభుత్వమే భరించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు. ఫైనాన్స్ డిపార్టుమెంట్, ఆర్అండ్‌బి డిపార్టులతోపాటు అన్ని డిపార్టుమెంట్‌ల నుంచి క్లియరెన్సులు వచ్చాయని తెలిపారు. జులై మాసంలో ఆన్‌లైన్‌లో బహిరంగ టెండర్లు పిలవడం జరుగుతుందన్నాని, టెండర్లు పూర్తి కాగానే సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయని, బ్రిడ్జి నిర్మాణ ప్రారంభం నుంచి 18 నెలలో పూర్తి అవుతుందని తెలిపారు.

నియోజకవర్గ పరిధిలో.....

నేడు గురజాల నియోజకవర్గంలో పెద్ద గ్రామంగా ఉన్న జానపాడు శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. పిడుగురాళ్ల పట్టణంలో కార్మికులు, వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు చాలా మంది నివసిస్తున్నారు. పట్టణం ఇప్పటికే నిండిపోయింది, కాలనీలుగా అభివృద్ధి జరగాలంటే జనపాడు ఒక్కటే ఉంది, అందుకే నేడు ప్రజలు ఎవరు స్థలాలు అమ్మకోవద్దని సూచించారు. రెండేళ్లల్లో భారీ స్థాయిలో భూముల రేట్లు పెరుగుతాయని, అభివృద్ధి కూడా అదేవిధంగా జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. సోమవారం గడప గడప కార్యక్రమం మొదటి రోజు ఎస్సీ, బీసీ, మైనార్టీ, రజక కాలనీల్లో సీసీ రోడ్లు అవసరమని అడగడం జరిగింది. మొత్తం రూ. 45 లక్షలకు ఎస్టిమేషన్ వేయించి వెంటనే 24 గంటల్లోనే మంజూరు చేయడం జరిగిందన్నారు. వచ్చే నెలలోనే సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఎస్సీ, బీసీ, మైనార్టీ కాలనీ నుంచే తాగునీరు మొదలుపెట్టి గ్రామంలోని ప్రతి ఇంటికి పైపులైన్ ద్వారా మంచినీటిని అందిస్తామని తెలియజేశారు. అలాగే గ్రామంలో రూ. 3.50 కోట్లతో సైడు కాలువలు, డ్రైనేజీని నిర్మించడం జరిగిందన్నారు. వందేళ్ల నుంచి సమస్యగా మారిన చాకిరేవు బ్రిడ్జి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ. 87 లక్షలతో చాకిరేవు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ముస్లింలకు, కాపులకు షాదీఖానా, కాపు భవనం త్వరలోనే నిర్మిస్తామన్నారు. ఎస్సీలకు రెండు కమ్యూనిటీ హాల్స్ నిర్మాస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, గ్రామ సర్పంచ్ గడిపూడి వెంకట రమణ, ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి, నాయకులు గడిపూడి పుల్లయ్య, మాజీ సర్పంచ్ తాళ్లపోగు మర్యాద రావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఉన్నం నరసింహారావు, డాక్టర్ ఉన్నం నాగమల్లిఖార్జున రావు, సొసైటీ అధ్యక్షుడు ఉన్నం శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు కూరపాటి కొండలు, ఉన్నం శ్రీనివాసరావు, మోర్జంపాటి కాశీం, జమాల్, వైఎస్ ఎంపీపీ సాతులూరి బాబు, గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ గఫార్, ఎంపీటీసీలు మన్నెం శ్రీనివాసరావు, షేక్ బుడే, కొతారు నరసింహారావు, మాజీ జెడ్పీటీసీ వీరభద్రునిరామిరెడ్డి, మండల మైనార్టీ కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి, వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీడీఓ ప్రసాద్



జగనన్న సురక్ష పథకం సమీక్షలో పాల్గొన్న అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు

వెల్దుర్తి: అర్హులై ఉండి నవరత్నాలలో భాగమైన సంక్షేమ పథకాలు రానివారుంటే వారిని గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ డి ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని శిరిగిరిపాడు సచివాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు రానివారుండకూడదని, అర్హులై ఉండి పథకాలు రానివారుంటే వారిని గుర్తించి వారికి అక్కడికక్కడే సంక్షేమ పథకాలు మంజూరు చేయించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతి గడపకు వెళ్లి ఆ గడపలో వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదాని విచారించి అందజేయాలన్నారు. సంక్షేమ పథకాలు రాని వారుంటే వారిని గుర్తించి జులై 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో వారికి ఇంటి వద్దనే అన్నీ ధృవీకరణ పత్రాలు ఉచితంగా ఇచ్చి పథకాలు అందేలా చూస్తామన్నారు. ఇప్పటికే గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు రాని వారి జాబితాను తయారు చేస్తున్నామన్నారు. మండల స్థాయి అధికారులు రెండు గ్రూపులుగా ఏర్పడి 14 సచివాలయాల్లో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాచర్ల జెడ్పీటీసి పెద మల్లుస్వామి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవ రెడ్డి, అధికారులు, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, వలంటీర్లు తదితరులున్నారు.

మాచర్ల: పట్టణంలోని ప్రతి వార్డు అభివృద్ధి చేద్దామని ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీఎం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టడం జరిగినట్లు మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని నెహ్రూ నగర్ ప్రాంతంలో ఇంటింటి సర్వే నిర్వహించి ఆయన మాట్లాడారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ప్రజల కోసం ఇంతలా తపించలేదన్నారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేస్తూ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఈవి రమణబాబు, వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కౌన్సిలర్లు పోలా శ్రీను, రామిశెట్టి వెంకటేశ్వర్లు, రామాంజనేయరెడ్డి, గట్ల కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: జగనన్న సురక్ష ద్వారా అర్హులైన వారందరికి న్యాయం జరుగుతుందని పలువురు వ్యక్తులు అన్నారు. పట్టణంలోని ఎర్రవారి బజార్, 15వ సచివాలయ పరిధిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్న సురక్ష పథకం ద్వారా 11 రకాల సర్టిఫికెట్లను అందజేయడం జరుగుతుందన్నారు. అంతే కాకుండా పరిష్కరించదగిన సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని వారు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఎల్ఓ బ్రహ్మారెడ్డి, జేఏసీ కన్వీనర్ జూలకంటి శ్రీనివాసరావు, కౌన్సిలర్ ఉన్నం ఆంజనేయులు, కో ఆప్షన్ సభ్యులు ఎండీ జబ్బీర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారధులకు తదితరులు ఉన్నారు.

బస్సు యాత్రకు స్పందన కరువు

దుర్గి: టీడీపీ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో చేపట్టిన భవిష్యత్తుకు గ్యారంటీ చైతన్య రథయాత్ర మంగళవారం దుర్గి మండలంలో టీడీపీ పార్టీకి చెందిన నాయకులు బస్సు ద్వారా పర్యటించారు. కారంపూడి మండలం నుంచి దుర్గి మండలం అడిగొప్పల గ్రామానికి మధ్యాహ్నం సమయానికి చేరుకుంది. టీడీపీ పార్టీకి బలమైన గ్రామంగా చెప్పుకునే అడిగొప్పలలో పట్టుమని పదిమంది కార్యకర్తలు కూడా కనిపించకపోవడంతో అట్టహాసంగా బయలుదేరిన జిల్లా నాయకులు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. మండల కేంద్రం దుర్గిలో వారికి స్వాగతం పలకడానికి కనీసం ఒక్కరు కూడా లేకపోవడంతో నేరుగా చైతన్య రథ యాత్ర బస్సు మాచర్లకు వెళ్లిపోయింది. కారంపూడి , దుర్గి మండలానికి చెందిన కొంతమంది యువకులు 10 నుంచి 15 బైకులు ద్వారా వారిని అనుసరించి మాచర్ల పట్టణం వైపు వెళ్లారు.

బహిరంగ సభ అట్టర్ ఫ్లాప్

సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభం కావాల్సిన బహిరంగ సభ జనం లేకపోవడంతో రాత్రి 8 గంటలకు సభను నిర్వహించారు. సభలో 400 నుంచి 500 మంది మంది కార్యకర్తలు పాల్గొనడంతో రాష్ట్ర జిల్లా టీడీపీ నాయకులు ఒకరి ముఖం ఒకరు చూసుకుని వచ్చిన దారే పోవడానికి సిద్ధపడ్డారు. ఈ ఘటనతో పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్చార్జి జూలకంటి బ్రహ్మానంద రెడ్డి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. సభకు హాజరైన పలువురు రాష్ట్ర జిల్లా నాయకులు తూతూ మంత్రంగా మామా అనిపించి కార్యక్రమాన్ని ముగించారు.

ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు

ఎంపీపీ దాసరి చౌడేశ్వరి



మాట్లాడుతున్న ఎంపీపీ దాసరి


రెంటచింతల: రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి గడపకు తాను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందించాలనే మంచి మనస్సుతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. మంగళవారం మండలంలోని పాలువాయి గ్రామ సచివాలయం ఆవరణలో పాలువాయి, తుమృకోట, పాలువాయిగేటు, మంచికల్లు, పశర్లపాడు గ్రామాలకు చెందిన వలంటీర్లకు, గృహసారథులు, సచివాలయ సిబ్బందికి జగనన్న సురక్ష కార్యక్రమంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజల సంక్షేమమే తమ ధ్యేయంగా సీఎం జగన్ తలపెట్టిన ఈ కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్లి అర్హత ఉండి సంక్షేమ పథకం అందని వారికి అందించడమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. ఈ మహత్తర కార్యక్రమం ద్వారా 11 రకాల ఉచిత సేవలను ప్రజలకు అందించి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్య సాధనలో మీరందరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. జులై 1 నుంచి 30వ తేదీ వరకు చేపట్టిన ఈ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రామచంద్రరావు, సర్పంచ్‌లు పొట్లపాటి చంద్రారెడ్డి, నలబాలు నాయక్, చింత సుబ్బారావు, సచివాలయాల మండల కన్వీనర్ సీతారామిరెడ్డి, అధికారులు, వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల అసత్య ప్రచారం సరికాదు



పిడుగురాళ్ల: వైఎస్సార్ సీపీ నాయకులపై టీడీపీకి చెందిన దియ్యా రామకృష్ణ సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయడం సరికాదని వైఎస్సార్ సీపీ మాచవరం మండల నాయకుడు వడ్లమూడి శివకృష్ణ అన్నారు. పట్టణంలోని సితార హోటల్ వద్ద మంగళవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు శివకృష్ణ మాట్లాడుతూ టీడీపీకి చెందిన దియ్యా రామకృష్ణ సోషల్ మీడియాలో తనపై అసత్య ప్రచారాలు చేయటమే కాకుండా తనను పోలీసులు అరెస్టు చేశారని, అలాగే ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని వ్యంగ పదజాలంతో సంబోధించడం దుర్మార్గమన్నారు. తప్పుడు ప్రచారాలు చేసి టీడీపీ నాయకుల దగ్గర మన్నన పొందేందుకు ఇటువంటి దిగజారుడు కార్యక్రమాలకు పూనుకోవడం తన భవిష్యత్‌కు మంచిది కాదని ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకులు గొట్టె ముక్కల పవన్‌రెడ్డి, పట్టణ యూత్ అధ్యక్షులు మందా సుధీర్, కౌన్సిలర్ పసుపులేటి ఆనంద్, మార్కెట్ యార్డు డైరెక్టర్ , ఎంపీటీసీ మట్టారెడ్డి, వడ్లమూడి బ్రహ్మానందం, బాషా, రత్నబాబు, నరసింహారావు, అప్పారావు, అంబటి శ్రీకాంత్, వడ్లమూడి వెంకటేష్, వడ్లమూడి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ వినియోగంపై అవగాహన సదస్సు



వెల్దుర్తి విద్యుత్ సబ్ స్టేషన్ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసి మల్లుస్వామి

వెల్దుర్తి: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తోందని డీఈ జె హరిబాబు అన్నారు. మంగళవారం మండలంలోని వెల్దుర్తి విద్యుత్ సబ్ స్టేషన్‌లో పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్‌ల వరకు ఉచితంగా విద్యుత్‌ను అందిస్తుందన్నారు. మీటర్లు లేనివారు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండలంలో 11 విద్యుత్ సబ్ స్టేషన్‌లతో పాటు 33/11కెవి సబ్ స్టేషన్ ఉందన్నారు. ప్రభుత్వం నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరలో ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను 9గం''ల పాటు అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని ప్రాధాన్యతల వారీగా పరిష్కరిస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో ఉన్న సమస్యలను తమ దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకురావాలన్నారు. జూన్ 26 నుంచి జులై 2 వరకు విద్యుత్ భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ వారోత్సవాల్లో రైతులకు, విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు సభలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల జెడ్పీటీసి మల్లుస్వామి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, అధికారులు రామయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సిబ్బంది తదితరులున్నారు.

నిరుపేదలకు అన్నదానం

గురజాల : స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ పాటపాటేశ్వరి అమ్మవారి దేవాలయంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని నగర పంచాయతీ కమిషనర్ అన్నదాత మోహన శ్రీనివాస్ ప్రారంభించారు.

నల్లమలలో విత్తన బంతులు చల్లేందుకు రానున్న కలెక్టర్



అడవి బాట ఏర్పాటును పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

కారెంపూడి: పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ శుక్రవారం కారెంపూడి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను తహసీల్దార్ జి శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. కారెంపూడికి చెందిన ప్రకృతి ప్రేమికుడు కొమెర అంకారావు (జాజి) నల్లమలలో కోటి విత్తన బంతులు చల్లాలని లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో కలెక్టర్ ఆ బృహత్తర కార్యక్రమంలో పాల్గొనేందుకు కారెంపూడి విచ్చేస్తున్నారని తహసీల్దార్ తెలిపారు. కారెంపూడికి చెందిన ప్రకృతి ప్రేమికుడు అంకారావు (జాజి) నల్లమల అడవి సంరక్షణకు చేస్తున్న కృషిని కలెక్టర్ గుర్తించారని అలాంటి ఆణిముత్యం కారెంపూడిలో ఉన్నందుకు గర్వపడాలన్నారు. ఈ నేపథ్యంలో అడవికి వెళ్లేందుకు వీలుగా బాట ఏర్పాటు పనులను తహసీల్దార్ పరిశీలించారు. బాటను లెవలింగ్ చేసి గోతులు పూడ్చాలని సంకల్పించి అందుకు అవసరమైన చర్యలు అధికారులు తీసుకుంటున్నారు. అంతకు ముందు స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయులు విద్యార్థులతో తహసీల్దార్ శ్రీనివాస్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అడవుల వల్ల ఉపయోగాలను మనం చదువుకుంటున్నామని అలాంటి అడవులను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ప్రస్తుతం వాతావరణ కాలుష్యం వల్ల కన్పిస్తోందని పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరు బాధ్యతగా స్వీకరించాలని తహసీల్దార్ కోరారు. మొక్కలను నాటి వాటిని సంరక్షణ చేయడంతో పాటు పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్ లాంటి వస్తు వినియోగానికి దూరంగా ఉండాలని హితవు పలికారు. సీడ్‌బాల్స్ తయారీ గురించి జాజి విద్యార్థులకు వివరించారు. సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమంలో అనేక పాఠశాలల విద్యార్థులు వేలాదిగా పాల్గొంటున్నారని జాజి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టి రఘుబాబు, వీఆర్వో కృష్ణప్రసాద్, ఉపాధ్యాయులు వైఎస్సార్‌సీపీ నాయకులు కొమెర పిచ్చెయ్య, వేముల లింగయ్య పాల్గొన్నారు.

రైతులు ఆశించిన విధంగానే నేషనల్ హైవే

జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పిడుగురాళ్ల: రైతులు ఆశించిన విధంగానే నేషనల్ హైవే వారికి తెలియజేస్తామని జాయింట్ కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో కొండమోడు- పేరేచర్ల నేషనల్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులతో జాయింట్ కలెక్టర్ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఆయన మాట్లాడుతూ నేషనల్ హైవే 167 ఏజీ కొండమోడు-పేరేచర్ల నాలుగు లైన్ల కోసం నేషనల్ హైవే వారు తెలియజేసిన ప్రకారం 14 ఎకరాల భూ సేకరణ కోసం రైతులతో మాట్లాడేందుకు వచ్చామని తెలియజేశారు. రైతులు వారి వద్ద ఉన్న డాక్యుమెంట్స్, పట్టాదార్ పాస్ పుస్తకం, బ్యాంక్ పాస్‌పుస్తకం తీసుకోవడం జరిగిందని ఆయన తెలియజేశారు. రైతులు ప్రస్తుతం ధరప్రకారం తమకు రేటు చెల్లించాలని తెలియజేశారని, అదేవిధంగా కొంత మంది రైతులు తమకు జీవనాధారమైన పొలం పోతుంది కాబట్టి తమకు తగిన న్యాయం చేయాలని సూచించారని తెలియజేసిన్నట్లు పేర్కొన్నారు. రైతులు తెలియజేసిన విషయాలను నేషనల్ హైవే వారికి తెలియజేస్తామని తెలియజేశారు. త్వరలోనే రాజుపాలెం, సత్తెనపల్లి, ముప్పాళ్ల వంటి ప్రాంతాల్లోని రైతులతోకూడా మాట్లాడతామని తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చక్రవర్తి, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అనుమతులు లేకుండా స్కూల్ నిర్వహణ



అనుమతులు లేకుండా స్కూల్‌ను ఏర్పాటు చేసిన భవనం

మాచర్ల: ప్రభుత్వ అనుమతులు, గుర్తింపు లేకుండా పట్టణంలోని 13వ వార్డులో ఓ పాఠశాల అనధికారికంగా నెల రోజులుగా నిర్వహిస్తున్నారు. ఒక ప్రముఖ టీడీపీ నాయకుడు ఆధ్వర్యంలో ఓక్ బ్రిడ్జ్ స్కూల్ పేరుతో నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ నర్సరీ నుంచి 9వ తరగతి వరకు అడ్మిషన్లు తీసుకుంటూ పాఠశాలను కొనసాగిస్తున్నారు. భవనంలో నిర్వహించేందుకు ఎటువంటి అనుమతులు లేకుండా విద్యార్థులను చకచకా చేర్చుకుంటూ పాఠశాల తరగతులను జరుపుతున్నారు. రిజిస్ట్రేషన్, రికగ్నైజేషన్ నంబర్లు ఏమీ లేకుండానే బ్యానర్లు కట్టి పాఠశాల నిర్వహణను యాజమాన్యం వారు కొనసాగిస్తున్నారు. తమ బిల్డింగ్‌లో నిర్వహిస్తున్న పాఠశాలకు ప్రతి ఒక్క విద్యార్థి అడ్మిషన్ పొందాలని తెలుగుదేశం నాయకుడు ఒత్తిడితో పాఠశాలలో విద్యార్థుల చేరికలు కొనసాగుతున్నాయి. గతంలో సైతం ఇదే బిల్డింగ్‌లో అనుమతులు లేకుండా ఒక ప్రముఖ విద్యా సంస్థ పాఠశాల నిర్వహించినప్పుడు అధికారులు దాడులు జరిపారు. అప్పట్లో పాఠశాలకు తాళాలు వేశారు. ఆ పేరుతో ఖాళీ చేసి వెళ్లిపోగా, తిరిగి మరో సంస్థ అనుమతులు లేకుండా నిర్వహించేందుకు పనులు ప్రారంభించారు. అనుమతులు లేకుండా పాఠశాల నిర్వాహకులు విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారు.ఎంఈఓ వేముల నాగయ్య ఎటువంటి అనుమతులు లేకుండా 13వ వార్డులో పాఠశాల నిర్వహిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని. దీని పై వారికి హెచ్చరికలు జారీచేసినన్న తెలిపారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు



ఎస్ఎంసీ చైర్మన్ యర్రంరెడ్డి వీరారెడ్డిని సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

పిడుగురాళ్ల: ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దిన ఏకైక సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ యర్రంరెడ్డి వీరారెడ్డి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థుల గురించి ఆలోచించి వారి కోసం జగన్న విద్యా కానుక, బడికి పిల్లలను పంపిస్తే తల్లుల అకౌంట్‌లో అమ్మ ఒడి కింద నగదు జమ అలా అనేక సంక్షేమ పథకాలను తీసుకుని వచ్చారని తెలిపారు. అంతేకాకుండా నాడు నేడు ద్వారా పాఠశాల రూపు రేఖలను మార్చారని, జగనన్న గోరుముద్ద ద్వారా వారికి పౌష్టికాహారం అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని ఆయన తెలియజేశారు. గతంలో ఏ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా చదవలేదని, నేడు కార్పొరేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకే ఎక్కువ మార్కులు వస్తున్నాయని దీనిని గమనించాలని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, పాఠశాల ప్రదానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరుల పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై రైతులు మక్కువ చూపాలి

జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పిడుగురాళ్ల: చిరుధాన్యాల సాగుపై రైతులు మక్కువచూపాలని జాయింట్ కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ సూచించారు. మండలంలోని పందిటివారి పాలెంలో చిరుధాన్యాల పంటలపై అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2023 సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందని ఆయన తెలియజేశారు. ఇందులో భాగంగా చిరుధాన్యాల పంటలైన రాగి, కొర్ర, వరిగ, సజ్జ, జొన్న మొదలైన పంటలను అధిక విస్తీర్ణంలో సాగు చేయాలని తెలియజేశారు. పత్తి పంటకు ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, ఆదాయం పొందుటకు పోషక విలువలు కలిగిన కంది పంట విస్తీర్ణమును కూడా పెంచాలని రైతులకు తెలియజేశారు. కంది, రాగి విత్తన సంచులను సబ్సిడీపై రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ కంది ఎల్ ఆర్‌జీ-52 విత్తనములు 100 శాతం రాయితీపై ఆర్‌బీకే ల ద్వారా రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పంట నమోదు జులై 1వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని, ప్రతి రైతు సాగు చేసి పంటలను ఈ పంట కింద నమోదు చేసుకుని తద్వారా ప్రభుత్వ పథకం ప్రయోజనాన్ని పొందాలని తెలియజేశారు. డీఏఏటీసీ శాస్త్రవేత్త వరప్రసాద్ మాట్లాడుతూ కందిలో పూతరాలిపోకుండా పాటించవలిసన జాగ్రత్తలు తెలియజేశారు. 5 శాతం వేప నూనె ద్రావణం పిచికారి, 2 శాతం యూరియా ద్రావణం, నీటిలో కరిటే 13-45-0 ఎరువుల ద్రావణం పిచికారి చేయాలని రైతులకు సూచించారు.